క్లుప్తంగా

నేడు మొల్లమాంబ జయంతి

కర్నూలు(అర్బన్): కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతిని ఈ నెల 13వ తేదీన అధికారికంగా నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి. వెంకటలక్షుమ్మ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో మొల్లమాంబ చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ డా.జి. సృజన పూలమాల వేసి నివాళులర్పిస్తారన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, కుమ్మరి/ శాలివాహన కుల సంఘ నాయకులు హాజరు కావాలని ఆమె కోరారు.

గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ



గర్భిణికి బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి, ఇంతియాజ్ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలకు కర్నూలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఇంతియాజ్ పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ నవీన్, దేవదాయ శాఖ చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ తిరుమలేశ్వరరెడ్డి, రైల్వే ప్రసాద్, ఇ. లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

14న కేంద్రం తీరుపై నిరసన

కర్నూలు(సెంట్రల్): కార్మికులు, రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ కోరుతూ ఈనెల 14వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో వారు ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కోసం చట్టం చేయాలని కోరితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాల్పులు జరిపిస్తున్నారని ఆరోపించారు.

మహిళ రక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దాం

కర్నూలు(సెంట్రల్) : మహిళల రక్షణ, హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల పిలుపునిచ్చారు. మంగళవారం బుధవారపేటలోని మెరిడియన్ ఫంక్షన్ హాలులో ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల రక్షణ, హక్కుల కోసం ఉద్యమిద్దాం అనే అంశంపై ఐద్వా, శ్రామిక మహిళ సంఘం, యూటీఎఫ్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ అనురాధ, యూటీఎఫ్ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, అంగన్‌వాడీ టీచర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేణుక, పుణ్యవతి, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు కిరణ్మాయి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): ఈనెల 23 నుంచి 27 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. షేక్షావలి, శేఖర్, మహమ్మద్ రఫీ, సంపత్ కుమార్ ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా నారాయణపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. దీంతో వారిని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేసినట్లు హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి సువర్ణ మంగళవారం వెల్లడించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

కర్నూలు(సెంట్రల్): గూడ్స్‌షెడ్లకు సరైన మౌలిక వసతుల కల్పించేందుకు మోదీ ప్రభుత్వ గ్యారంటీ హామీ ఎంతో ఉపయోగపడుతుందని హైదరాబాద్ డివిజన్ డీఈఎన్(లైన్స్) అరుణకుమార్ శర్మ అన్నారు. మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌లోని అహ్మదబాద్ నుంచి పునర్ నిర్మించిన 240 గూడ్స్‌షెడ్లు, 69 కంటే ఎక్కువ గతి శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినళ్లు, సుమారు 69 రైల్ కోచ్ రెస్టారెంట్లు, 900 కంటే ఎక్కువ ఒకే స్టేషన్..ఒకే ప్రాడక్ట్ ట్రాలీలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈకార్యక్రమాన్ని కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌లో ఆయన వర్చువల్‌గా వీక్షించి మాట్లాడారు. అనంతరం అందుకు సంబంధించిన పైలాన్‌ను ఆయన ఏడీఎస్టీయూ భాస్కర్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయకుమార్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్ డి.వెంకటరాజు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మున్నా, జీరావ్, స్టేషన్ మేనేజర్ శేషఫణి, బీజేపీ నాయకులు రాఘవేంద్ర, శ్రీరామ్ యాదవ్, గీతామాధురి, ఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకున్న పాల్గొన్నారు.

వ్యసనాన్ని ‘పొగ’బెడదాం!

- పొగ తాగే అలవాటుతో అనర్థాలు
- మానితే ఆరోగ్య ప్రయోజనాలు
- పెద్దాసుపత్రిలో టొబాకో సజెషన్ సెంటర్
- ఉచితంగా నికోటిన్ ప్యాచెస్, గమ్స్
- పొగాకు అలవాటు మానిపించేందుకు చికిత్స
- నేడు నో స్మోకింగ్ డే

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం. ఈ విషయాన్ని ప్రతి పొగాకు ఉత్పత్తిపై పెద్ద పెద్ద అక్షరాలు, బొమ్మలతో ముద్రించి ఉంటారు. అయినా, కొందరు వాటి వాడకాన్ని వీడడం లేదు. ఫలితంగా జేబుకు చిల్లు పడటమే గాక ఆరోగ్యమూ గుల్ల అవుతోంది. ఈ పరిస్థితి రాకముందే పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల గురించి ఎవరికి వారు అవగాహన చేసుకుని మానుకుంటే వారి ఆరోగ్యం బాగుపడటమే గాక, కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. నేడు (బుధవారం) నేషనల్ నో స్మోకింగ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో బీడీ, సిగరెట్, చుట్ట, గుట్కా విక్రయాలు తగ్గడం లేదు. ధర ఎంతైనా వాటిని కొనుగోలు చేసి వాడుతున్నారు. పొగాకు ఉత్పత్తుల వ్యాపారాన్ని నిర్వహించే టోకు వర్తక వ్యాపారులు నగరంలోని పాతబస్తీలో అధికంగా ఉన్నారు. వీరి నుంచి నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, శ్రీశైలం వంటి ప్రాంతాలకు చిన్న తరహా డీలర్లు తీసుకెళ్లి అక్కడి రిటైల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇలా ప్రతి నెలా జిల్లాలో రూ.30 కోట్లకు పైగానే వ్యాపారం జరుగుతోందని అంచనా. ఇందులో సిగరెట్లు, బీడీలే ఎక్కువగా అమ్ముడవుతున్నాయి.

నిషేధ చట్టం అమలులో ఉన్నా...

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2008 అక్టోబర్ 2న బహిరంగ ధూమపాన నిషేధ చట్టం(సీవోటీపీ–2008)ని రూపొందించింది. ఈ చట్టం ప్రకారం బస్టాండ్, రైల్వేస్టేషన్లు, సినిమా హాళ్లు, మార్కెట్, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, జనసంచారం ఉండే ప్రదేశాల్లో ధూమపాన నిషేధం అమలులో ఉంది. దీనిని అతిక్రమిస్తే రూ.200ల జరిమానాతో పాటు జైలుశిక్ష విధించాలని చట్టం చెబుతోంది. పొగాకు ఉత్పత్తులను 18 ఏళ్లలోపు ఉన్న వారికి అమ్మినా జరిమానా విధించాలి. పొగాకు నియంత్రణ, బహిరంగ ధూమపానాన్ని అరికట్టే బాధ్యతను పోలీసులు, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జాతీయ హెల్త్ మిషన్ ఫైనాన్స్ మేనేజర్, ప్రభుత్వ వైద్యులకు అప్పగించారు. కానీ ఎక్కడా ఈ చట్టం అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. బస్టాండ్, టీ కొట్లు, రైల్వేస్టేషన్లు, రైళ్లు, బస్సులలో ధూమపానం చేస్తున్నారు.

పొగాకు మానేందుకు డీ అడిక్షన్ సెంటర్

నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా 2021 జనవరిలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సైకియాట్రిక్ విభాగంలో టొబాకో సజెషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఒక సైకాలజిస్టు, ఇద్దరు సోషల్ వర్కర్లు ఉన్నారు. పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారికి ఇక్కడ కౌన్సిలింగ్, బిహేవియర్ థెరపీ చేస్తూ మూడు నెలల పాటు అలవాట్లు మాన్పించేందుకు గాను నికోటిన్ ప్యాచెస్, నికోటిన్ గమ్స్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. దీంతో పొగతాగాలి, పొగాకు నమలాలి అనే ఆలోచనను తగ్గిస్తుంది. వీటి వల్ల అనారోగ్య సమస్యల నుంచి బయటకు రావడానికి ఉపయోగపడతాయి. 2019లో 202 మంది, 2020లో 1334 మంది, 2021లో 2,254 మంది, 2022లో 2,234 మంది, 2023లో 2405 మందికి చికిత్స అందించారు.

పొగాకు వాడకాన్ని ఇలా మానుకోవాలి

- పొగాకును ఒకేసారి మానకుండా రోజురోజుకు వాడకం తగ్గించుకుంటూ రావాలి.
- పొగాకు మానడానికి కాగితంపై తేది నిర్ణయించుకుని దానిని ఒకచోట అతికించాలి. కుటుంబ సభ్యులకు ఆ తేదీని చెప్పి వారిని సహకరించాలని కోరాలి.
- నికోటిన్ మాత్రలు, ప్యాచెస్ వాడవచ్చు.

పొగాకు మానితే ప్రయోజనాలు

- గుండెజబ్బులు, క్యాన్సర్, రక్తపోటుకు దూరంగా ఉండొచ్చు
- రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది.
- రుచి, వాసన, గ్రహణశక్తి మెరుగవుతుంది
- ఆయుష్షు పెరుగుతుంది.



సిగరెట్ నమూనా



ధూమపానం మాన్పించే నికోటిన్ ప్యాచెస్, గమ్స్ ప్యాకెట్స్

ధూమపానంతో క్యాన్సర్



ధూమపానం కారణంగా క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రధానంగా పొగాకు ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, స్వరపేటిక, అన్నవాహిక, జీర్ణాశయం, మూత్రాశయ క్యాన్సర్లను కలగజేస్తుంది. బీడీ, సిగరెట్ తాగే వారిలో చేతులు, కాళ్లలోని నరాలు మూసుకుపోతున్నాయి. ఫలితంగా కాళ్లు, చేతుల్లో రక్తప్రసారం తగ్గిపోయి నల్లగా మారిపోయి తీవ్ర నొప్పిని కలగజేస్తున్నాయి. గ్యాంగ్రిన్‌గా మారిన కాలు, చేతిని తప్పనిసరి పరిస్థితిలో తీసేయాల్సి వస్తోంది. –డాక్టర్ సి.వాసురెడ్డి, సర్జికల్ ఆంకాలజిస్టు, కర్నూలు

కౌన్సెలింగ్‌తో మార్పు వస్తోంది



ఈ కేంద్రానికి ఎక్కువగా పొగాకు, గుట్కాలు తీసుకునే వారు వస్తున్నారు. ఇందులో 11 ఏళ్ల పిల్లల నుంచి యువకులు, పెద్దలు ఉంటున్నారు. వీరికి కౌన్సెలింగ్ చేసి నికోటిన్ ప్యాచెస్, నికోటిన్ గమ్స్‌ను ఉచితంగా ఇస్తున్నాము. ఇప్పటి వరకు వీటిని వెయ్యి మందికి పైగా ఇవ్వగా 220 మంది అలవాటు మానుకున్నారు. ప్యాచెస్, గుట్కాలు శరీరంలోకి వెళ్లి పొగాకు తీసుకోవాలన్న అలవాటును మాన్పిస్తాయి. –కె. చంద్రశేఖర్, సైకాలజిస్టు, టొబాకో సజెషన్ సెంటర్, కర్నూలు

పటిష్టంగా ఎంసీసీ అమలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు (అర్బన్) : రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)పై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) టీమ్‌లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని పాల్గొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వస్తుందన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఎంసీసీ టీమ్స్ మీద ఉందన్నారు. సివిజిల్ యాప్‌ను ఎప్పటికప్పుడు మానిటర్ చేసే అలవాటు అలవర్చుకోవాలన్నారు. ఈసారి ఎన్నికల ఖర్చు అసెంబ్లీ స్థానానికి 40 లక్షలు, పార్లమెంటు స్థానానికి 95 లక్షలు వరకు పరిమితి పెంచారన్నారు. ఎంసీసీ టీమ్‌లు చేసే పని అంతా ఒక్కటే అయినప్పటికీ బాధ్యతలు వేర్వేరుగా ఉంటాయన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ద్వారా ఫిర్యాదు వచ్చిన వెంటనే సంబంధిత ప్రాంతానికి వెళ్లి ఎంక్వైరీ చేస్తారన్నారు. వీడియో సర్వేలెన్స్ టీమ్ ద్వారా పొలిటికల్ ర్యాలీ/మీటింగ్ జరుగుతున్నప్పుడు వీడియో తీస్తారన్నారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ ద్వారా చెక్‌పోస్టుల వద్ద ఎంసీసీ విధులు నిర్వహిస్తారన్నారు. ఇన్ని కార్యకలాపాలను కేవలం 1 లేదా 2 టీమ్‌లు పర్యవేక్షణ చేయలేవు. కనుక 6,7 టీంలను ఏర్పాటు చేశామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ హ్యాండ్‌బుక్‌ను ప్రతి ఒక్కరూ చదివి అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ (జీఎస్టీ) ఎం.సుధాకర్‌రావు, జిల్లాపరిషత్ సీఈఓ నాసరరెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం సోమశేఖర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రజలందరికీ ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. మంగళవారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం నందవరం గ్రామంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. శిబిరానికి వచ్చిన వారికి వైద్యసేవలు అందుతున్నాయా, ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తున్నారా, అవసరమైన వారిని ఉన్నత ప్రమాణాలు గల ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారా అని ఆరా తీశారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ వారితో కలిసి మురికి కాలువలను, దిబ్బలను ఎత్తివేయించాలని, దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి పంచాయతీ వారితో క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా దోమలు ప్రబలకుండా ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే చేయాలని, జ్వరం ఉన్న వారిని వైద్యుల వద్దకు పంపించి వైద్యసేవలు అందేలా చూడాలని తెలిపారు.

ఎన్నికల మెటీరియల్‌ను జాగ్రత్తగా చెక్ చేసుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే మెటీరియల్‌ను ఎప్పటికప్పుడు రిసీవ్ చేసికొని భద్రపరచాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, మెటీరియల్ మేనేజ్‌మెంటు జిల్లా నోడల్ అధికారి అమరనాథరెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో నియోజక వర్గాల మెటీరియల్ మేనేజ్‌మెంటు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నియోజక వర్గాలకు మెటీరియల్ ఎంత వచ్చింది... పూర్తి స్థాయిలో వచ్చిందా... తక్కువ పడితే వెంటనే తెలియజేయాలని పేర్కొన్నారు. అన్ని రకాల మెటీరియల్ సరఫరాను చెక్ చేసుకోవాలని, కొరత ఏర్పడకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో నియోజక వర్గాల అధికారులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా ఆరోగ్యశ్రీ అమలు



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్ఓడీలు, ప్రొఫెసర్లతో ఆరోగ్యశ్రీ, ఈ–హాస్పిటల్ అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ ఈఎన్‌టీ, పీడియాట్రిక్, యురాలజీ, మెడికల్ డిపార్ట్‌మెంట్, కార్డియాలజీ విభాగాలు ఆరోగ్యశ్రీని మరింత బాగా అమలు చేయాలని సూచించారు. ఏడు కేసుల్లో తిరస్కరణకు గురైన ఆరోగ్యశ్రీ కేసుల్లో ఐదు అప్రూవల్ అయ్యాయని తెలిపారు. ఈ–హాస్పిటల్ అమలు ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో బాగా చేస్తున్నారని చెప్పారు. రోగులకు రాసే ల్యాబ్ రిక్విషన్ ఫామ్, మెడిసిన్ రిక్విషన్ ఫామ్‌లో 11 అంకెల యూహెచ్ ఐడీ నెంబర్ తప్పనిసరిగా రాయాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న డైట్, సెక్యూరిటీ, పారిశుధ్యంపై ఆయా విభాగాలలో హెచ్ఓడీలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓడాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ రాధారాణి, డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మరణాలపై సమీక్ష

పెద్దాసుపత్రిలో నెలవారీ మరణాలపై వైద్యులతో సూపరింటెండెంట్ సమీక్ష నిర్వహించారు. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో ఈ సమీక్ష జరిగింది. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన రెండు కేస్‌షీట్‌లపై ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష చేశారు. జనరల్ మెడిసిన్ విభాగానికి సంబంధించిన కేస్‌షీట్‌లో రోగికి సంబంధించిన వివరాలు సరిగ్గా నమోదు చేయకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. వచ్చే సమీక్ష సమావేశంలో మరణాలపై మరింత క్షుణ్ణంగా సమీక్షిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ కొండారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.

పత్తిలో అధిక సాంద్రత పద్ధతులను ప్రోత్సహిద్దాం

కర్నూలు(అగ్రికల్చర్): పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి ఎంతో ఉత్తమమైనదని, దీనిపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ పక్కన ఉన్న కర్నూలు ఏడీఏ కార్యాలయంలో కర్నూలు మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధిక సాంద్రత పద్ధతిలో మొక్కల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, దీంతో దిగుబడులు రెట్టింపు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే విధంగా పత్తిలో గులాబిరంగు పురుగు నివారణకు సి.బెళగల్ మండలంలో 40 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన పీబీ నాట్ పద్ధతి సత్ఫలితాలు ఇచ్చిందని తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ శశిధర్‌రెడ్డి, కర్నూలు మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను గెలిపించుకుందాం





వైఎస్సార్‌సీపీ నగర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఇంతియాజ్, శరీన్‌నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు (టౌన్) : కలిసికట్టుగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ గెలిపించుకుందామని కర్నూలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఇంతియాజ్‌బాషా అన్నారు. మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నరసింగరావు పేటలోని పార్టీ నగర కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం చేసిన జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీని మళ్లీ గెలిపించుకునేందుకు ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మద్దయ్య, గోశాల చైర్మన్ ఆది మోహన్‌రెడ్డి, రైల్వే ప్రసాద్, గద్దం రామక్రిష్ణ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

23వ వార్డు రిసోర్స్ పర్సన్లతో సమావేశం

స్థానిక 23 వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి, పార్టీ ఇన్‌చార్జ్ కటారి సురేష్ స్వగృహంలో రిసోర్స్ పర్సన్లతో సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, కర్నూలు నియోజకవర్గ సమన్వయ కర్త ఇంతియాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. పొదుపు సంఘాల సభ్యులకు సొంత అన్నలా అన్ని విధాలుగా వైఎస్ జగన్ అండగా నిలబడ్డారన్నారు.

ఆటోలో ప్రయాణిస్తూ..

కలెక్టర్ హోదాలో పనిచేసిన ఇంతియాజ్ ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రస్తుతం కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్తగా నగరంలో కలియ తిరుగుతున్నారు. ఇంటింటికి వెళ్లి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను వివరిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మాజీ కర్నూలు పార్లమెంటు సమన్వయకర్త బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో కలిసి గణేష్ నగర్‌లో ఆటోలో ప్రయాణించారు. మహిళా ఆటో డ్రైవర్ గౌతమితో మాట్లాడి నేటి యువతకు మీరు ఆదర్శమని అభినందించారు.

జగనన్నతోనే రాజన్న రాజ్యం

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాజన్న రాజ్యాం సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13 వసంతాలు పూర్తి చేసుకుని 14వ సంవత్సరంలోకి అడుగుపెట్టడంతో మంగళవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు ప్రభుత్వంలో, పార్టీలో ఉన్నత పదవులు ఇచ్చి వారిని ఎదిగేలా చేసిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రానికి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్వేతారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్రీనివాసులు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, నాగమద్దిలేటి, జయన్న, ఫిలిప్, పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో మౌలిక వసతులు

కల్లూరు: నగరంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి కల్లూరు అర్బన్ 19వ వార్డు మారుతీ నగర్‌లో రూ.50 లక్షలతో, సోమిశెట్టి నగర్‌లో రూ.50 లక్షలతో, 20వ వార్డులోని వివిధ కాలనీల్లో రూ.70 లక్షలతో సీసీ రోడ్ల ఏర్పాటుకు వారు భూమిపూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సహకారంతో నగర అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలని ప్రజలను కోరారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మంచి చేసిన తమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు, నాయకులు భీమశంకర్‌రెడ్డి, రంగారెడ్డి, గోపాల్ రెడ్డి, యూనస్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్, స్పీకర్ల విరాళం

కర్నూలు(అగ్రికల్చర్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) కర్నూలు జిల్లా శాఖ సామాజిక సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. మంగళవారం బి.క్యాంపులోని ట్రిబల్ వెల్ఫేర్ బాలికల విద్యాలయంలో రూ.19 వేలు విలువ చేసే మైక్‌సెట్, స్పీకర్లు, ఇతర సామగ్రి విరాళంగా అందజేశారు. ఏఐబీఈఏ అడ్వైజర్ నాగరాజు, మహిళా నాయకురాళ్లు శైలజ, రోజారమణి, మంజీర వాణి, ఇతర నాయకులు శివకృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశానికి రక్షణ

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంతోనే దేశానికి రక్షణ అని బీజేపీ అధికార ప్రతినిధి పీటీ సాయి ప్రదీప్ అన్నారు. మంగళవారం బుధవార పేటలోని ఆపార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్ని –5 క్షిపణితో భారత్ రక్షణ రంగం మరింత బలోపేతమైందన్నారు.

దాడి కేసు నమోదు

కర్నూలు : వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో రెండో పట్టణ పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనివాసులురెడ్డి, నాగరాజు, రఘు, సుధాకర్, భాస్కర్ జనసేన పార్టీలో కొనసాగుతున్నారు. అయితే, శ్రీనివాసులు రెడ్డి మిగతా నలుగురితో చర్చించకుండా పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరితరెడ్డి వెంట ప్రచారానికి తిరుగుతున్నాడు. తమకు చెప్పకుండా ఆమె వెంట ప్రచారానికి ఎలా వెళ్తావు అంటూ వాదులాడుకున్నారు. అయినా, శ్రీనివాసులు రెడ్డి తీరు మార్చుకోకపోవడంతో ఈనెల 10వ తేదీన విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటి దగ్గర ఉన్న అతడిని నాగరాజు, రఘు, సుధాకర్, భాస్కర్ కలసి తమ వాహనంలోకి ఎక్కించుకుని ప్రకాష్ నగర్ శివారులోకి తీసుకెళ్లి కొట్టి గాయపరిచారు. బాధితుడు ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకుని మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండవ పట్టణ పోలీసులు తెలిపారు.

వైభవంగా రంగనాథ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకారంలో గోదా రంగనాథ స్వామి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో శ్రీగోదా రంగనాయకి సమేత రంగనాథస్వామి దేవాలయం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సుప్రభాతం, అర్చన, విశేషాలంకారం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, స్వస్తి వాచనం, పుణ్యాహ వాచనం, అంకురార్పణ, ధ్వజాధివాసం కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, శ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో మద్యాధూల సముద్రాల రామాకాన్తాచార్య స్వామి ఆధ్వర్యంలో అర్చక స్వాములు పూజలు నిర్వహించారు. గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త మాట్లాడుతూ గోదాదేవి, రంగనాథ స్వామి వార్లకు బుధవారం శేషవాహన సేవ, కల్పవక్ష వాహన సేవలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గోదాగోకులం మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

- న్యాయ వాదులతో జేసీ నారపురెడ్డి మౌర్య



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం శంకుస్థాపనకు విచ్చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులకు జేసీ నారపురెడ్డి మౌర్య కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆమె న్యాయ వాదులతో సమావేశమయ్యారు. ట్రిబ్యునల్, జ్యూడిషియల్ అధికారుల వివరాలను ఆమె వారిని అడిగి తెలుసుకున్నారు. వారందరికీ జిల్లా అధికార యంత్రాంగం తరఫున న్యాయ విశ్వ విద్యాలయం శంకుస్థాపనకు ఆహ్వానాలు పంపేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే న్యాయవాదులు తప్పనిసరిగా డ్రెస్ కోట్ వేసుకొని రావాలని, న్యాయ విద్యార్థులు తెలుపు కలర్ డ్రెస్ వేసుకొని రావాలని సూచించారు. లా నేస్తం విద్యార్థులను తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. కర్నూలు, ఆదోని,ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు సంబంధించి ఎంతమంది శంకుస్థాపన కార్యక్రమానికి వస్తారు అనేది ఈ రోజు సాయంత్రంలోపు వివరాలను మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో కె.మధుసూదన్‌లకు తెలపాలని జేసీ బార్ అసోసియేషన్ సభ్యులను సూచించారు. కాగా, కర్నూలు నుంచి కార్యక్రమానికి వచ్చే న్యాయవాదులు, న్యాయ విద్యార్థులను ఉదయం 8 గంటలకు ఎస్టీబీసీ కళాశాల మైదానం నుంచి బస్సులో, ఆదోని, ఎమ్మిగనూరుల నుంచి కూడా బస్సులో తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, డీటీసీ శ్రీధర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఆర్.ఆనందరావు, కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణంనాయుడు, అసోసియేట్ సెక్రటరీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

సభాస్థలిని పరిశీలించిన కమిషనర్

కర్నూలు (టౌన్) : నగర శివారులోని జగన్నాథగట్టు వద్ద జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు నిర్వహిస్తున్న భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 14 వ తేదీన రానున్నారు. ఈనేపథ్యంలో అక్కడ చేస్తున్న సభాస్థలిఏర్పాట్లను మంగళవారం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే లాయర్లకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు.